క్లుప్తంగా

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం


వైఎస్సార్ సీపీ నాయికులతో ఎంపీ శ్రీధర్

దెందులూరు: దెందులూరులో గౌడ, రజక, తొగర, సామాజిక వర్గాల ఉమ్మడి శ్మశాన వాటికల ఆధునికీకరణకు నిధులు మంజూరుకు ప్రాధాన్యతా క్రమంలో కృషి చేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో దెందులూరు మండల వైఎస్సార్ సీపీ జగనన్న సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సప్పా మురళి, రామారావుగూడెం ఉపాధ్యాయులు కాలి రామారావు, రాజులపాటి మధు, పీ. సురేంద్ర తదితరులు ఎంపీ శ్రీధర్‌ను కలిశారు.

జీవన ఎరువులు వాడాలి

దెందులూరు: వరిలో రైతులు ఎరువులు తగిన మోతాదులో వాడాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కే.ఫణికుమార్ అన్నారు. మంగళవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు డీ.భావన, ఎం. శ్వేత, బీ.ప్రమీల, ఎం.లక్ష్మి, ఎస్.గిరిజా ఆధ్వర్యంలో వరి సాగులో మెళకువలు, పరిశోధన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ వరిసాగులో ద్రవరూప జీవన ఎరువులు వాడటం వల్ల పిలకబాగా పట్టి మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈనె దశలో ఉన్న వరి పంటలో పిలకలను లెక్కిస్తూ రైతులకు జీవన ఎరువులపై అవగాహన అవసరమని అన్నారు. అనంతరం ద్రవరూప జీవన ఎరువుల వాడకంపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు.

రైల్వే ట్రాక్ మరమ్మతులు

భీమడోలు: భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మత్తుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ట్రాక్ అత్యవసర మరమ్మతులలు నేపథ్యంలో ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మూసి వేస్తున్నట్లు సంబంధిత రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు చేపట్టిన ట్రాక్ మరమ్మతులను సంబంధిత సాంకేతిక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీ బుధవారం సాయంత్రం ట్రాక్ పనులు పూర్తి చేసి గేటు మీదుగా వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తారు. ప్రస్తుతం ట్రాక్‌పై బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు కుర్లెళ్లగూడెం, పాతూరు రైల్వే గేటుల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.

లాన్ టెన్నిస్‌పై శిక్షణ

దెందులూరు: లాన్ టెన్నిస్ విధులు, క్రీడా కౌశలం, వ్యాయామ అధ్యాపక విద్యార్థులకు కీలకమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తాని యేల్ అన్నారు. మంగళవారం కళాశాలలో లాంగ్ టెన్నిస్ ఓరియంటేషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్ఐఎస్ కోచ్ కరీముల్లా మాట్లాడుతూ ఉదయం థియరీ, ప్రాక్టికల్ తరగతుల ద్వారా విద్యార్థులందరూ తర్ఫీదు పొందాలని క్రమశిక్షణ, నిరంతర సాధనతో విజయం సాధ్యమన్నారు. వైస్ ప్రిన్సిపల్ పీడీకేడీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ శ్యామల, రమేష్, విజయలక్ష్మి ఉన్నారు.

భీమ నాగలింగేశ్వర స్వామి వార్షికోత్సవం

దెందులూరు: గాలాయగూడెంలో భీమ నాగలింగేశ్వరస్వామి 5వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామివారి కల్యాణం గ్రామంలోని పలువురు దంపతులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షల నిర్వహణ
- ఏలూరులో 16 కేంద్రాల ఏర్పాటు
- 345 మంది ఇన్విజిలేటర్ల నియామకం
- 3 సిట్టింగ్, 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు


నగరంలోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షలు ఏలూరు నియోజకవర్గ పరిధిలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో, ప్రతీ తరగతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కార్యాలయానికి అనుసంధానం చేశారు. కాగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ షాపులను మూసివేయాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు నిరంతరం పర్యవేక్షించనున్నాయి. పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం అందుబాటులో ఉంటుంది. విద్యార్థులు ఎవరూ కింద కూర్చుని పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా ప్రతీ కేంద్రంలో బెంచీలు అందుబాటులో ఉంచారు. పరీక్ష ప్రారంభానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు.

ఏలూరులో 16 కేంద్రాలు

ఏలూరు నియోజకవర్గానికి సంబంధించి ఏలూరు నగరంతో పాటు పినకడిమి కలిపి మొత్తం 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో శశి జూనియర్ కళాశాల, ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలకు చెందిన 3 ప్రాంగణాలు, నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన రెండు ప్రాంగణాలు, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన 3 ప్రాంగణాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల, సీఆర్ఆర్ అటానమస్ కళాశాల, సీఆర్ఆర్ మహిళా కళాశాల, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన రెండు ప్రాంగణాలు, పినకడిమిలోని సెయింట్ డీపాల్ జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా సిద్ధం చేశారు.

13836 మంది హాజరు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏలూరు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 16 కేంద్రాల్లో మొత్తం 13836 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 7179 మంది ఉండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6657 మంది ఉన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు ముగుస్తాయి.

ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు..

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి 3 ఫ్లయింగ్ స్క్వాడ్, 3 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఏలూరు నియోజకవర్గంలోని 16 పరీక్షా కేంద్రాలను ఈ స్క్వాడ్‌లు నిరంతరం పర్యవేక్షిస్తాయి. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఒక జూనియర్ లెక్చరర్, ఒక రెవెన్యూ ఉద్యోగి, ఒక పోలీస్ ఉద్యోగి ఉంటారు. అలాగే సిట్టింగ్ స్క్వాడ్‌లో ఇద్దరు జూనియర్ లెక్చరర్లు ఉంటారు. వీరితో పాటు ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, మరో అసిస్టెంట్ డిపార్ట్‌మెంట్ అధికారి ఉంటారు. మొత్తం 58 మంది ఈ విధులను నిర్వర్తిస్తారు. ఈ పరీక్షలకు మొత్తం 345 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

ఈ పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమై ఏప్రిల్ 4వ తేదీ వరకూ జరుగుతాయి. పరీక్షకు, పరీక్షకు ఒక రోజు విరామం వచ్చేలా షెడ్యూల్‌ను రూపొందించారు. తొలి రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, రెండవ రోజు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి.

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇలా

ఈ నెల 15న రెండవ లాంగ్వేజ్ పేపర్-1, 17న ఇంగ్లీష్ పేపర్-1, 20న గణితం పేపర్ -1ఏ, బోటనీ పేపర్ -1, సివిక్స్ పేపర్-1 23న గణితం పేపర్ -1బీ, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్ -1 పరీక్షలు జరుగుతాయి. 25న ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1, 28న కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్ -1, సోషియాలజీ పేపర్ -1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-1, 31న పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ పేపర్-1, లాజిక్ పేపర్-1, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్-1, ఏప్రిల్ 3న చివరి పరీక్షగా మోడరన్ లాంగ్వేజ్ పేపర్-1, జాగ్రఫీ పేపర్-1 జరుగుతాయి.

ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు షెడ్యూల్ ఇలా

ఈ నెల 16వ తేదీన రెండవ లాంగ్వేజ్ పేపర్-2, 18న ఇంగ్లీష్ పేపర్-2, 21న గణితం పేపర్ -2ఏ, బోటనీ పేపర్ -2, సివిక్స్ పేపర్-2, 24న గణితం పేపర్ -2బీ, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్ -2 పరీక్షలు జరుగుతాయి. 27వ తేదీన ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2, 29న కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్ -2, సోషియాలజీ పేపర్ -2, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్-2, ఏప్రిల్1న పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ పేపర్-2, లాజిక్ పేపర్-2, బైపీసీ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు గణితం పేపర్-2, ఏప్రిల్ 4వ తేదీన చివరి పరీక్షగా మోడరన్ లాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్-2 పరీక్షలు జరుగుతాయి.

జవాబు పత్రాల్లో తేడా ఉంటే ఇన్విజిలేటర్‌కు తెలపాలి



విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలి. పరీక్ష హాలులోకి చేరగానే వారికి ఇచ్చిన ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలు, వారి మీడియం, ఇతర వివరాలు, 24 పేజీల జవాబు పత్రం ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలి. వాటిలో విద్యార్థుల వివరాలు, ఇతరత్రా ఏ తేడా ఉన్నా వెంటనే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకువెళ్లాలి. పరీక్షలకు సంబంధించిన గోప్యత సరంజామా అంతా ఇప్పటికే సంబంధిత పోలీస్ స్టేషన్లలో భద్రపరిచాం. పరీక్షలకు నియమించిన చీఫ్ సూపరింటెండ్‌లతో సహా ఎవరూ సెల్‌ఫోన్‌లను వినియోగించరాదు.

కె.చంద్రశేఖర బాబు, ఆర్ఐఓ, ఏలూరు

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు

భీమడోలు: డ్వాక్రా సంఘాల నిర్వహణ రికార్డులు సక్రమంగా లేని పక్షంలో సహించేది లేదని డీపీఎం (ఐబీ) ఈ.అనిత అన్నారు. భీమడోలు వైఎస్సార్ క్రాంతిపథం మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండలంలోని గ్రామ సంఘాల ప్రతినిధులకు నిధుల వినియోగపు రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణపై వచ్చే నెల వార్షిక ఆడిట్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధికారుల బృందం రికార్డుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం పి.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. డీపీఎం (ఐబీ) ఈ.అనిత, డీపీఎం (ఫైనాన్స్), పార్థసారధి, ఏపీఎం (ఐబీ) ఏసురత్నం రికార్డులను పరిశీలించి లోపాలను సరి చేసుకోవాలని పలు సూచనలందించారు. డ్వాక్రా సంఘాల పనితీరును సూచించే ఆడిట్‌లో లోపాలు లేకుండా రికార్డులను సరి చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 45 సంఘాల పరిధిలో 1,759 డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

చింతలపూడి: సీతానగరం గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. అక్రమంగా బదిలీ చేసిన యూనియన్ ఆఫీస్ బేరర్ల బదిలీలను రద్దు చేసి స్థానికంగా కొనసాగించాలని, కార్మికులు, ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్నారు. ఉద్యోగులకు, కార్మికులకు చెల్లించాల్సిన ఇంక్రిమెంట్లు, జీతాల పెరుగుదల విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంభిస్తున్న నిరంకుశ వైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్ డిమాండ్ చేశారు. 2012 నుంచి కార్మిక చట్టాలను అమలు చేయకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. గోద్రేజ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు ఆర్‌వీ సత్యన్నారాయణ, మొడియం నాగమణి, సాయికిరణ్, నత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి

ఏలూరు రూరల్: బాలబాలికల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన నులిపురుగులు నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని 15వ డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అధికారులు చేపట్టిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్ల రూపాయలు వెచ్చించి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారని గుర్తు చేశారు. పిల్లలు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఎదగాలంటే నులి పురుగుల నివారించాలన్నారు. విద్యాశాఖాధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేసి పిల్లలు అందరికీ తప్పకుండా మాత్రలు వేయాలన్నారు. మరో పక్క సుంకరవారితోట ప్రాథమికోన్నత, మాదేపల్లి జడ్పీ పాఠశాలలో హెచ్ఎం ఎస్ శ్రీనివాసరావు, సుంకర విజయలక్ష్మీ , పువ్వుల ఆంజనేయులు, నంబూరి రాంబాబు, బి.శ్రీనివాసరావు తదితరులు పిల్లలకు మాత్రలు వేశారు.


15వ డివిజన్ పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాము


ఆర్ఈసీలో ఆల్‌బెండజోల్ ట్యాబ్లెట్లను కళాశాల ప్రిన్స్‌పాల్‌కు అందిస్తున్న ఏఎన్ఎం

800 మందికి మాత్రల అందజేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో 19 సంవత్సరాల విద్యార్థులకు జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా సుమారు 800 మందికి నులిపురుగు నివారణ మందులు (ఆల్‌బెండజోల్) పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. శ్రీనివాసు మాట్లాడుతూ నులిపురుగులు పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులని తెలిపారు. వీటి వలన శరీరంలో రకత హీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపు నొప్పి వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వీటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆల్‌బెండజోల్ మందులు వినియోగించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండీ కే. సాయి రోహిత్, ఎన్ఎస్‌సీ కో-ఆర్డినేటర్ కే.మధుబాబు పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్ చూపిన బాటలో ముందుకెళ్లాలి

ఏలూరు (టూటౌన్): కారల్‌మార్క్స్ చూపిన బాటలో సమాజంలో మార్పు కోసం కృషి చేద్దామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. కారల్ మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా స్థానిక నర్సింహరావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం చర్చా గోష్టి నిర్వహించారు. ఏవీఆర్ విజ్ఞానకేంద్రం, సీఐటీయూ, యూటీఎఫ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ చర్చాగోష్టికి గుడిపాటి నర్సింహరావు అధ్యక్షత వహించగా పి.ఆదిశేషు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కారల్‌మార్క్స్ చిత్రపటానికి ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, వై.ఆనందనాయుడు, శ్రీహరికోటి , మేతర అజయ్‌బాబు, ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): ప్రపంచంలో అనేక మంది తత్వవేత్తలు సమాజాన్ని పరిపరి విధాలుగా విశ్లేషించారే కానీ మారే సమాజాన్ని తెలియజెప్పింది కార్ల్ మార్క్స్ మాత్రమే అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. కార్ల్ మార్క్స్ 140వ వర్ధంతి సంధర్భంగా స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రవి మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, బి.సోమయ్య, కె.శ్రీనివాస్, పీవీ రామకృష్ణ, ఏ.శ్యామల రాణి, నగర నాయకులు జె.గోపి తదితరులు పాల్గొన్నారు.


కారల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సాబ్జీ

'గోరుముద్ద'పై సంతృప్తి

దెందులూరు: జగనన్న గోరుముద్ద విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకమని సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, వైస్ సర్పంచ్ ఏనుగు హేమసాగర్ అన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌తో పాటు జగనన్న గోరుముద్దను విద్యార్థులతో కలిసి వారు రుచి చూశారు. నాణ్యత, రుచి పట్ల ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులను అభినందించారు.

ఈ- పంట నమోదు జాబితా ప్రదర్శన

ఉంగుటూరు: ఈ- పంట నమోదు జాబితాలో అభ్యంతరాలు ఉంటే రైతులు ఈనెల 19 లోపు ఆర్‌బీకేలలో తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు, నాచుగుంట, నీలాద్రిపురం కాగుపాడు, కైకరంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఆయన ఈ పంట నమోదు జాబితాలు వెల్లడించి, ప్రదర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమావేశాలు ఏర్పాటు చేశారు. ఉంగుటూరు ఏఏ జాన్సి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.కోటితో కబేళా అభివృద్ధి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు శాసన సభ్యులు ఆళ్ల నాని ఆదేశాలతో సుమారు కోటి రూపాయల నిధులతో నగరంలోని కబేళాలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. స్థానిక మాదేపల్లి రోడ్‌లోని మేకల కబేళాలో మంగళవారం నిర్వహించిన జమాతుల్ ఖురేషి (మేక మాంసం వర్తక సంఘం) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కబేళాలోని రక్తపు నీరు కాలువల ద్వారా బయటకు వెళ్లడం ద్వారా దుర్వాసన రావడం కారణంగా స్థానిక ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకొని రూ.25 లక్షలతో అధునాతన టెక్నాలజీతో ట్రీట్మెంట్ ప్లాంట్‌ను నిర్మించి బయటకు వచ్చిన రక్తపు నీటిని శుద్ధి చేసి అనంతరం బయో కెమికల్ ప్రాసెస్ చేసి ఆ నీటిని మొక్కలు పెంపకానికి ఉపయోగిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీని కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయగలిగామన్నారు. అదే విధంగా కబేళాలో నేల పైన పడిన మలినాలు నీరు భూమిలోకి పీల్చుకోకుండా ఫుడ్ ఇండస్ట్రీస్‌లో ఉపయోగించే పీయూ ఫ్లోరింగ్ చేయించామని, అవసరమైనన్ని ఎగ్జాస్ట్ ఫ్యాన్లు అమర్చినట్లు తెలిపారు. కబేళాలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో జమాతుల్ ఖురేషి ముస్లింలు సమాజులు, ప్రార్థనలు, కార్యవర్గ సమావేశాలు నిర్వహించుకోవడానికి కౌన్సిల్‌లో తీర్మానం చేసినట్లు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు ఐక్యతతో కబేళాను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఈ సందర్భంగా మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఎస్‌ఎంఆర్ పెదబాబు దంపతులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, ఎన్. సుధీర్ బాబు, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాస్, మహమ్మద్ ఇలియాస్ పాషా, దారపు తేజ అనూష, మాజీ కార్పొరేటర్ లంకలపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

దివ్యాంగులకు ఉత్తమ సేవలు అందించాలి

ఏలూరు రూరల్: ప్రత్యేక ఉపాధ్యాయులు దివ్యాంగులకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా కామన్ పరీక్ష బోర్డు సెక్రటరీ ఎ.సర్వేశ్వరరావు అన్నారు. మంగళవారం దొండపాడులో ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగే శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఆత్మ సంతృప్తి ఇస్తుందన్నారు. దివ్యాంగులకు పాఠాలు నేర్పడం ఎంతో సంక్లిష్టమైనప్పటికీ గౌరవంతో కూడుకున్నదన్నారు. డాక్టర్ ఎస్.సీతారామకృష్ణ మాట్లాడుతూ 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం 21 రకాలు వికలాంగత్వాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలన్నారు. పరివర్తన స్కూల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఐఆర్‌టి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన ఎందరో దివ్యాంగులకు విద్యాబుద్ధులతో పాటు సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్ రవి భార్గవ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న సర్వేశ్వరరావు

మైనర్లు వాహనాలు నడపొద్దు

పెదవేగి : మైనర్ బాల బాలికలు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ హెచ్చరించారు. పెదవేగిలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	29
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

సీహెచ్‌సీలో వైద్యాధికారి గైర్హాజరు

- రాత్రివేళల్లో అందని వైద్య సేవలు
- రాష్ట్ర అధికారి తనిఖీలో వెల్లడైన వైనం

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరులో అనధికారికంగా వైద్యాధికారి డాక్టర్ నవీన్ విధులకు హాజరుకావడం లేదు. మరొక వైద్యాధికారి సుందర్‌ను నియమించినా ఆయన ఇంకా బాధ్యతలు తీసుకోలేదని వైద్యశాల సూపరింటెండెంట్ ప్రియదర్శిని వెల్లడించారు. మంగళవారం వైద్యశాఖ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ పీ.నాగేశ్వరరావు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన 30 పడకల వైద్యశాలను, ఆపరేషన్ థియేటర్, తాగునీరు, మందులు, రిజిస్టర్‌ను రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ తనిఖీ చేశారు. తనిఖీ అధికారితో సూపరింటెండెంట్ మాట్లాడుతూ జనవరి నుంచి విధి నిర్వహణకు డాక్టర్ నవీన్ హాజరు కావడం లేదని, మరో వైద్యాధికారిని నియమించినా ఆయన కూడా రావడం లేదని ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్‌కు తెలియజేశామన్నారు. ఇద్దరు వైద్యాధికారులు ఆస్పత్రికి రావడం లేదని, రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని గుర్తించామని ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎస్‌పీఓ పీ.నాగేశ్వరరావు అన్నారు. ఈ ఆస్పత్రిలో మొత్తం ఆరుగురు వైద్యులు సేవలందించాల్సి ఉంది. ప్రస్తుతం నలుగురు మాత్రమే ఇక్కడ వైద్య సేవలందిస్తున్నారు. కొత్తగా వచ్చిన వైద్యులు బాధ్యతలు చేపట్టిన తరువాత ఓపీ 300 పెరిగిందని, రోగులకు వైద్య సేవలు, పారిశుద్ధ్యం, వైద్యశాల నిర్వహణ, తాగునీరు, విద్యుత్‌ను సంతృప్తికరంగా అందించడంపై ఎస్‌పీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం ఎస్‌పీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్యశాఖలో కాయకల్ప గ్రామంలో ప్రధానంగా సీహెచ్‌సీలో వైద్యసేవలు, వైద్యులు, సిబ్బంది నిర్వహణ, భవనాల నిర్మాణం, నాణ్యత, పారిశుద్ధ్యం ప్రధానాంశమన్నారు. వీటిని తనిఖీ చేయడానికి అమరావతి నుంచి వచ్చానని ఏలూరు జిల్లాలో గతంలో విధులు నిర్వహించానని ఎస్‌పీఓ నాగేశ్వరరావు అన్నారు.


దెందులూరు సీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వరరావు